'వెలగపూడి'లో వణుకు

- ఓటమి భయంతో చవకబారు రాజకీయాలు
- ప్రజలతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ మమేకం
- ఐదేళ్లలో 'తూర్పు'లోమారిన రాజకీయ పరిస్థితులు


వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మితో కలిసి ప్రచారం ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. టీడీపీకి కంచుకోటగా ఉండే ఈ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పాగా వేయడానికి పావులు కదుపుతోంది. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటికే ఇక్కడ బలమైన అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ రంగంలోకి దింపింది. ఆయన ప్రజలతో మమేకమై అన్ని వార్డుల్లోనూ ప్రచారంతో దూసుకుపోతున్నారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. యువకులు, మహిళలు, వృద్ధులు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు.

మొన్నటి వరకు టీడీపీకి తిరుగులేదనుకొనే పరిస్థితి ఇప్పుడు మారిపోయింది. మూడు సార్లు వరుసగా గెలిచిన విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబులో ఓటమి వణుకు కనిపిస్తోంది. తూర్పు నియోజకవర్గం 2009లో కొత్తగా ఏర్పాటైంది. అప్పటి నుంచి టీడీపీకి చెందిన వెలగపూడి మూడు సార్లు గెలుపొందారు. నియోజకవర్గంలో 15 వార్డులు ఉన్నాయి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇక్కడ టీడీపీకి చెక్ పడింది. వెలగపూడి తన సొంత వ్యాపారాల వైపు మరలిపోయి గెలిపించిన ప్రజలను మరిచిపోయారు. చివరకు చాలా మంది ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆయనకు దూరమయ్యారు.

టీడీపీ పతనానికి నాంది అప్పుడే..

2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థుల ఓటమే ఆ పార్టీ పతనానికి నిదర్శనం. ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఉన్న 15 వార్డులకు 11 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా విజయం సాధించారు. కేవలం ముగ్గురు కార్పొరేటర్లకు టీడీపీ పరిమితమైంది. మరో కార్పొరేటర్ జనసేన పార్టీ నుంచి గెలుపొందారు.

'వెలగ'బెట్టింది లేక నిందలు


టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణ

తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నుంచి దీటైన అభ్యర్థి బరిలో నిలవడం.. రోజురోజుకూ ఆ పార్టీ బలం పెరుగుతుండడంతో ఓడిపోతానేమోనన్న ఆందోళన టీడీపీ అభ్యర్థి వెలగపూడిలో నెలకొంది. మరో వైపు ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు బాగా చేరువయ్యాయి. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ఏదో విధంగా బలహీనపరచాలనే ఆలోచనతో


డబ్బు, క్రికెట్ కిట్లు ఉన్నట్లు వెలగపూడి ఫిర్యాదు మేరకు ఆదివారం ఎంవీవీ అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

వెలగపూడి చవకబారు రాజకీయాలకు తెరదించారు. ఆ భయంతోనే ఎన్నికల అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆ పార్టీ నాయకులే చెప్పుకోవడం విశేషం. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు చెందిన ఎండాడ ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్‌లో డబ్బు, క్రికెట్ కిట్లు, ఇతర సామగ్రి ఉన్నట్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం ఆర్డీవో భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఎక్కడా ఎలాంటి వస్తువులు, నగదు లభించకపోవడంతో అధికారులు వెనుదిరిగారు. టీడీపీ అభ్యర్థి తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని తేల్చిచెప్పారు.

- వెలగపూడి గతంలోనూ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు నానా హంగామా చేశాడు. అధికారులు విచారణ చేపట్టగా వెలగపూడి బాగోతం బయటపడింది. ఓటమి భయంతోనే ఇలా తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని వెలగపూడిపై ప్రజలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్న పరిస్థితులు ప్రస్తుతం తూర్పు నియోజకవర్గంలో నెలకొన్నాయి.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పనిచేయాలి


మాట్లాడుతున్న ముువ్వల సురేష్

బీచ్ రోడ్డు: సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా అందరం కలిసి సమన్వయంతో పని చేయాలని క్లస్టర్ ప్రెసిడెంట్ మువ్వల సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం జీవీఎంసీ 21వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ గెలుపు కోసం కష్టపడాలని కోరారు.

'విశాఖతో చారిత్రాత్మక అనుబంధం'

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నంతో బీజేపీకి చారిత్రాత్మక అనుబంధం ఉందని ఆ పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు విశేష స్పందన లభించిందన్నారు. విశాఖ ఎంపీ సీటును బీజేపీకి కేటాయించాలని కూటమి పెద్దలకు సూచించామన్నారు. ప్రజా గళం సభలో ప్రధాని మోదీ భద్రత విషయంలో నిర్లక్ష్యం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పైడిమాంబ నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం


పైడిమాంబ అమ్మవారు

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకొని డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యా యి. ఈ ఉత్సవాలు ఈ నెల 26 వరకు కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదటి రోజు విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి జల, క్షీర, పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం కుంకుమ పూజలు, సహస్రనామ పారాయణం, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. 26న అమ్మవారి జాతర మహోత్సవం, పరస జరుగుతుందన్నారు. ఈ ముగింపు ఉత్సవాలలో తప్పెటగుళ్లు, బుట్టబొమ్మలు డ్యాన్స్, బాణసంచా, సాముగరిడి, పులివేషాలు, తీన్‌మార్, ఒడిశా దూమ్‌దడక్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఏప్రిల్ 2న అమ్మవారికి మారు పండగ, ఆ రోజు మధ్యాహ్నం మహా అన్నసమారాధన చేపడతామన్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్


కాపాడిన యువకుడితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా యువకుడిని లైఫ్‌గార్డ్స్ కాపాడారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇవీ. పార్వతీపురం ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు సోమవారం సాయంత్రం సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులంతా సరదాగా గడిపి బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా వుండడంతో వారిలో గంటా మనోహర్ అనే యువకుడు కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, చిన్నప్పన్న, ఎం.అమ్మోరు, చందు, సతీష్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వీరికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

19 నుంచి పునీత జోజప్ప మహోత్సవాలు


జోజప్ప విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 19 నుంచి పాలక పునీత జోజప్ప మహోత్సవం జరగనున్న దృష్ట్యా సోమవారం కళాశాల ప్రాంగణంలో జోజప్ప విగ్రహానికి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ మాట్లాడుతూ దయామయుడు, ప్రేమైక మూర్తి ఏసుప్రభువు తండ్రి జోసెఫ్ పేరుతో స్థాపించిన కళాశాల నిరంతరం ప్రేమతో సంరక్షిస్తున్న పునీతను కీర్తిస్తుందన్నారు. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె. జయలక్ష్మి, సిస్టర్లు మేరీ, జైన్, నాన్సీ, దీపాలి, డెయిజీ, అధ్యాపకులు డాక్టర్ హరిణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ విస్తృత ప్రచారం


9వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంవీవీ


10వ వార్డు ఎస్‌ఐజీ నగర్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర శనివారం 19వ వార్డులో కొనసాగింది. ప్రజలు నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఈ యాత్ర కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఎంపీ ఎంవీవీ 64వ రోజు 19వ వార్డులో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో పాటు ఎంవీపీ కాలనీ సెక్టార్-12, లాసన్స్ బే కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంలో కొత్త ఒరవడిని సృష్టించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించామన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వసంత, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

10వ వార్డులో సహపంక్తి భోజనం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఎస్‌ఐజీ నగర్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వల్ల కలిగిన లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. వార్డులో స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేసిందని, మళ్లీ ఆదరించాలని ఎంవీవీ కోరారు. అనంతరం స్థానికుడు పతివాడ కనకరాజు నివాసంలో పార్టీ నాయకులతో కలిసి ఎంవీవీ సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు బొండా శ్రీనివాసరావు, మొల్లి వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ ప్రధానం


విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: సమాజంలో నిత్యం పెరిగిపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ ఎంతో ప్రధానమైన అంశమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. గ్లోబల్ రీ సైక్లింగ్ డేని పురస్కరించుకుని ఏయూ విద్యా విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏయూలో త్వరలో ఈ-వ్యర్థాలను సేకరించే ప్రత్యేకమైన ఈ-బిన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. నగరానికి చెందిన ఎంఎస్‌ఎంఈ సంస్థ ఎలక్ట్రో ప్రో సంస్థ సహకారంతో ఈ-వ్యర్థాలను పూర్తి స్థాయిలో రీ సైక్లింగ్ చేసే దిశగా పనిచేస్తామన్నారు. పుడమిని పరిరక్షించుకోవడంలో వ్యర్థాల నిర్వహణ ఒక ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజల్లో వీటిపై విస్తృత అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. వైద్య రంగంలో ఏర్పడే వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో రీ సైకిల్ చేయడం ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్లకార్డులను వీసీ వీక్షించి, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య డి.నాగరాజకుమారి, బోధన సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


మృతుడు భానుచైతన్య

సీతమ్మధార: మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... అక్కయ్యపాలెం, జగన్నాథపురంలో ఏయూ ఉద్యోగి శంకర్ శ్రీనివాస్ కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయన భార్య హైమావతి గవర్నమెంట్ టీచర్ కాగా, కుమారుడు భానుచైతన్య (20) ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం, కుమార్తె కళాశాలలో చదువుతున్నారు. భానుచైతన్య ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ఒక సబ్జెక్టు తప్పడంతో అప్పటి నుంచి మౌనంగా ఉండేవాడు. సోమవారం ఉదయం శంకర్ శ్రీనివాస్ విధులకు, హైమావతి పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్‌కు వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో భాను చైతన్య ఫ్యాన్‌కు ఉరి వేసుకుని, బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం మధ్యాహ్నం హైమావతి ఇంటికి వచ్చి చూడగా, భాను చైతన్య ఉరి వేసుకుని కనిపించాడు. ఇరుగు పొరుగు వారి సహాయంతో, కిందికి దించి పోలీసులకు సమాచారం అందించారు. ఫోర్త్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హెచ్‌సీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు


సాయి రమేష్‌ను అభినందిస్తున్న బాదంగీర్ సాయి తదితరులు

సీతమ్మధార : బాలనటుడిగా అంతులేని కథ, నేరము శిక్ష, మేమూ మనుషులమే, మీరైతే ఏం చేస్తారు వంటి చలన చిత్రాల్లో నటించి, తదుపరి సినిమా పరిశ్రమలో కొన్ని శాఖల్లో పని చేసిన విశాఖ వాసి సాయి రమేష్ (అలియాస్ రమేశ్ యాదవ్)ను శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ సొసైటీ (హైదరాబాద్) ఇటీవల తెలంగాణ కల్చరల్ అవార్డుతో సత్కరించింది. ఈ నేపథ్యంలో ఆయనను రంగసాయి నాటక గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, ధైర్యం చలన చిత్ర దర్శకుడు విష్ణుదేవ్, రచయిత చరణ్, నటుడు నవీన్, విజయలక్ష్మి, సుశీల తదితరులు అభినందించారు.

7న ద్రోణాచార్య స్కాలర్‌షిప్ పరీక్ష

బీచ్ రోడ్డు: వచ్చేనెల 7న ద్రోణాచార్య స్కాలర్‌షిప్ పరీక్ష కోసం నిర్వహించనున్నట్టు ఫీట్‌జీ(ఎఫ్ఐఐటీజేఈఈ) సంస్థ ప్రతినిధి త్రిశా ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ చదువుకుంటున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. https://dronacharyaexam.fiitjee.com/registration&process.html వెబ్‌సైట్‌లో వచ్చేనెల 5వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం


తోటగరువు హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


తోటగరువు కేంద్రంలోకి విద్యార్థులను తనిఖీ చేసి పంపిస్తున్న పోలీసులు

ఆరిలోవ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల కోసం ఆరిలోవ ప్రాంతంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కావడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి కేంద్రాలకు సమయం కంటే గంట ముందుగానే చేరుకున్నారు. దీంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా శ్రీకృష్ణాపురంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులం, ఆరిలోవలో భారతీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, విజేత స్కూల్, క్రిస్టినా స్కూల్, ఆదర్శనగర్‌లో శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్, విశాలాక్షినగర్‌లో బీవీకే పాఠశాలలో ఈ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిబంధనలు ప్రకారం ఉదయం 8.45 గంటలకు విద్యార్థులను పోలీసులు తనిఖీలు చేసి కేంద్రాల్లోకి విడిచిపెట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు వాటర్ కేన్‌లు ఏర్పాటు చేశారు. ఆరిలోవ పోలీసులు, సచివాలయాల కానిస్టేబుళ్ల కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించి పరీక్ష రాయడానికి వచ్చే విద్యార్థులను తనిఖీ చేశారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలాంటి పుస్తకాలు లోపలకు తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లతో పరీక్ష జరిగినంత సమయం అందుబాటులో ఉన్నారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

స్పా ముసుగులో వ్యభిచారం

బీచ్‌రోడ్డు: స్పా పేరుతో గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వైజాగ్ టవర్స్ బిల్డింగ్‌లో గల గ్లామ్ అండ్ గ్లో బ్యూటీ సెలూన్ థాయ్ స్పాలో వ్యభిచారం జరుగుతోందని స్పెషల్ బ్రాంచి పోలీసులకు, సీఐ పార్థసారథికి సమాచారం అందింది. వెంటనే ఇద్దరు మధ్యవర్తులతో స్పా కేంద్రంపై సోమవారం దాడి చేయగా ఓ యువతిని, విటుడు హితేష్ టీయాని పట్టుకున్నారు. స్పా నిర్వాహకురాలు నందూరి లక్ష్మి, వాసుబాబుతోపాటు మరో ఇద్దరు మహిళలను కూడా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం నందూరి లక్ష్మి, వాసుబాబును కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురు మహిళలకు కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు, రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం


ఆయుర్వేద వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం : ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో మంగళ, బుధవారాల్లో విశాఖలో ఉచిత సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం శివాజీపాలెంలోని కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విశాలాక్షినగర్‌లోని బీవీకే హైస్కూల్ ప్రాంగణంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి హైదరాబాద్‌కు చెందిన ఆక్యూప్రెషర్ వైద్య నిపుణులు గురూజీ జై శ్రీరామ్ హాజరవుతున్నారని తెలిపారు. రోజుకు 125 నుంచి 150 మందికి మాత్రమే పరీక్షలు చేయనున్నారన్నారు. ఆసక్తి ఉన్న వారు వాట్సాప్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98661 38129, 99666 51052 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎర్నిమాంబ అమ్మవారి హుండీ ఆదాయం రూ. 25.8 లక్షలు

కంచరపాలెం : జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు అమ్మవారి హుండీలు లెక్కించారు. 68 రోజులకుగాను అమ్మవారి దర్శనాలకు సంబంధించి రూ.25,88,219 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కంచరపాలెం పోలీసులు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీకి ఉద్యోగుల అభినందనలు


ఆరోగ్యశాఖ ఆర్‌డీ రామ గిద్దయ్యను అభినందిస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) డాక్టర్ రామ గిద్దయ్యను జేఏసీ ఉద్యోగుల సంఘం నాయకులు అభినందించారు. ఇటీవల ఆర్‌డీ రామ గిద్దయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. సంఘం నాయకులు ఎం. వెంకటలక్ష్మి, శ్రీనివాస ఆచార్యులు, నగేష్ పట్నాయక్, సాంబమూర్తి, రాము, బండారు శ్రీనివాస్, శేషు బాబు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
S.O.P 13/2024

Between:
Kambhampati Jayasree
W/o.Dr.Kambhampati Hari Babu,
Rep. its Power of Attorney Holder,
Sri. Buddha Lakshmi Narayana
S/o. Ramunaidu
... **Petitioner**

And
The State Bank of India,
Rep. by its branch Manager,
Kannayya Peta Branch,
Near Park Hotel, Visakhapatnam
... **Respondent**

GENERAL NOTICE
The petitioner herein filed the above petition to grant succession certificate to receive a sum of Rs.3,75,057/- from the respondent. That the Honourable Court ordered Paper Publication General Public have any objection may attend before the honourable court on 11-04-2024 at 10:30 A.M. before the Honourable Court failing which the Honourable Court will pass appropriate orders.

S.SREERAMAMURTHY, Advocate
Central Government Standing Counsel
D.No.1-63, Sandipini Nagar, Yendada,
Visakhapatnam - 530045. Cell : **9849633707**